క్లుప్తంగా

ఎమ్మెల్సీ వరుదు కల్యాణికి అభినందనలు


ఎమ్మెల్సీ వరుదు కల్యాణికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న బొర్రా విజయలక్ష్మి

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన ఎమ్మెల్సీ వరుదు కల్యాణిని అస్సాం గార్డెన్స్, నీలమ్మవేపచెట్టు అమ్మవారి ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొర్రా విజయలక్ష్మి, సభ్యులు లక్ష్మీకాంతం, కె.గంగా, కొల్లి సత్యవతి అభినందించారు. ఎమ్మెల్సీని తన కార్యాలయంలో కలసి శుభాకాంక్షలు తెలియజేశారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 46 మంది ఎంపిక


డ్రైవ్‌లో పాల్గొన్న విద్యార్థినులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి అధ్యక్షతన సోమవారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు కళాశాల జేకేసీ, ప్లేస్‌మెంట్ పార్క్‌తో కలిసి నిర్వహించిన డ్రైవ్‌లో 152 మంది విద్యార్థులు పాల్గొనగా 46 మంది ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉద్యోగ నైపుణ్యాలతో పాటు ఇంటర్వ్యూ స్కిల్స్ కూడా అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థినులకు సూచించారు. ఆయా కంపెనీల్లో గల ఉద్యోగావకాశాలు, కావల్సిన అర్హతలు, వేతనాల గురించి ప్లేస్‌మెంట్ పార్క్ సీఈవో వివరించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ పార్క్ రిక్రూట్‌మెంట్ మేనేజర్ శ్రీకాంత్, జేకేసీ కో–ఆర్డినేటర్ డి.అరుణపద్మ, మెంటార్ వి.ఎస్. రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

200 మందికి వైద్య పరీక్షలు


శిబిరంలో పరీక్ష చేసి మందులు అందిస్తున్న సిబ్బంది

డాబాగార్డెన్స్: విశాఖ వెల్డింగ్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్, ఓమ్ని హాస్పిటల్ క్లినిక్, మంగమ్మ డెంటల్ క్లినిక్ సంయుక్తంగా సోమవారం వైద్య శిబిరం నిర్వహించాయి. నగరంలోని ఇందిరా ప్రియదర్శినీ మున్సిపల్ స్టేడియం రోడ్డులో నిర్వహించిన శిబిరంలో సుమారు 200 మంది స్థానికులకు వైద్యులు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో విశాఖ వెల్డింగ్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘు, ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ, కార్యదర్శి శంకర్, సహాయ కార్యదర్శి విజయ్, ఏరియా ఇన్‌చార్జ్ వెంకటేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముందే వచ్చిన సంక్రాంతి


రంగవల్లులు తీర్చిదిద్దుతున్న విద్యార్థినులు


హరిదాసు వేషధారణలోని విద్యార్థినికి బియ్యం వేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

హరివిల్లు ఇల చేరినట్లుగా తీర్చిదిద్దిన రంగవల్లికలు.. హరినామ సంకీర్తనలు ఆలపిస్తూ హరిదాసు.. సంప్రదాయ వస్త్రధారణలో తరుణీమణులు .. సంక్రాంతి ముందే వచ్చిందా అన్నట్లుగా దర్శనమిచ్చింది విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల. కాలేజీలో సోమవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి మాట్లాడుతూ పాశ్చాత్య నాగరికత ప్రభావం ఎంత ఉన్నా, మన సనాతన సంప్రదాయాలను, సంస్కృతిని మరువకూడదన్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగల ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు హరిదాసు వేషధారణ, సంక్రాంతి గీతాలు, నృత్యాలు, రంగవల్లుల పోటీల్లో చురుగ్గా పాల్గొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ కె.సుధ, కల్చరల్ కో–ఆర్డినేటర్ ఎన్.వి.పద్మకుమారి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

– డాబాగార్డెన్స్

98 శాతం హామీల అమలు ఘనత సీఎం జగన్‌దే

- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- ఘనంగా ప్రజా సంకల్ప యాత్ర


పేదలకు చీరలు అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, వైఎస్సార్‌సీపీ 29వ వార్డు అధ్యక్షుడు పీతల వాసు

డాబాగార్డెన్స్: ప్రజా సంకల్పయాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా 29వ వార్డు జిల్లా పరిషత్ జంక్షన్లో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతల వాసు ఆధ్వర్యంలో సోమవారం సంబరాలు జరుపుకొన్నారు. ముందుగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. అనంతరం వార్డు పరిధిలోని 90 మంది నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రలో ప్రజల గుండె చప్పుడు విన్న జననేత ప్రజల సంక్షేమాన్ని కోరుతూ పథకాలకు రూపకల్పన చేశారన్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్న సంక్షేమ ఫలాల్లో 98 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఆ పాదయాత్రలో తాను పాల్గొన లేకపోవడం ఒకింత బాధగా ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రజలు పడుతున్న కష్టాలు, ఇబ్బందులను నేరుగా చూసి, ప్రత్యక్షంగా సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి అడుగులేస్తూ ఇడుపులపాయ మొదలు ఇచ్ఛాపురం వరకు సాగిన పాదయాత్ర అమోఘమన్నారు. సైన్యం ఉంటే సరిపోదని, దాన్ని నడిపే సమర్థవంతమైన నాయకత్వం ముఖ్య అవసరమన్నారు. మార్పు కావాలంటే నేర్పుతో కూడిన ప్రజా సంకల్పయాత్ర చేసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర తిరగరాశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బెవర మహేష్, కోరాడ సురేష్, అడపా శివ, కిలాని కుమార్, సంతోష్, డొప్ప సూరిబాబు, కనకల రాజు, ఆకుల రవి, వడ్డాది శివ, తారకరామ, తదితరులు పాల్గొన్నారు.

తక్షణం అర్జీల పరిష్కారం


అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న జెడ్సీ శివప్రసాద్

జగదాంబ: స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలకు వెంటనే పరిష్కారం చూపాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ ఆదేశించారు. సోమవారం జోన్–4 కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. యూజీడీ, తదితర పనులకు సంబంధించి ప్రజలు వినతులు సమర్పించారు. వీటిని వెంటనే సంబంధిత అధికారులకు పంపించి పరిష్కరించాలని జెడ్సీ సూచించారు.

ఇంటింటికీ క్లాప్ వాహనం తప్పక వెళ్లాలి


ఎస్‌బీఐ కాలనీ వద్ద ప్రజలతో మాట్లాడుతున్న జెడ్సీ శివప్రసాద్

జగదాంబ: చెత్త సేకరణ కోసం ఇంటింటికీ తప్పకుండా క్లాప్ వాహనం వెళ్లాలని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ కె.శివప్రసాద్ ఆదేశించారు. సోమవారం జోన్ పరిధిలో 31వ వార్డు ఆంథోనినగర్, ఎస్‌బీఐ కాలనీ, చాకలిపేట ప్రాంతాల్లో కార్పొరేటర్ బిపిన్‌కుమార్‌జైన్‌తో కలసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ జీవీఎంసీ లక్ష్య సాధన కోసం ఇంటింటికీ క్లాప్ వాహనం వెళ్లావల్సిన అవసరం ఉందన్నారు. శానిటరీ సెక్రటరీలు బాధ్యతగా విధులు నిర్వహించి క్లాప్ వాహనం రాకపోకల వివరాలు రికార్డు చేసుకుని పొందుపరచాలన్నారు. రహదారులపై, కాలువల్లో చెత్త కుప్పలు ఉండకూడదన్నారు. ప్రతి ఇంట్లో మూడు రకాలు డస్ట్‌బిన్లు తప్పక ఉండాలని, లేనిపక్షంలో సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్ అందజేయాలన్నారు. వాణిజ్య సముదాయాలు, దుకాణాల వద్ద కూడా చెత్త బుట్టలు ఏర్పాటు చేయాలని జెడ్సీ సూచించారు. చెత్త సేకరణకు అవసరాన్ని బట్టి వాహనాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఉదయాన్నే పారిశుధ్య కార్మికులతో పాటు సెక్రటరీలు కూడా విధులకు హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

అఆ ఫౌండేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బైపా

డాబాగార్డెన్స్: అంబేడ్కర్ ఆలోచనా (అ.ఆ) ఫౌండేషన్ 2023–24 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. జిల్లా కోర్టు ఎదురుగా గల బీఏకే చాంబర్లో ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్ బైపా అరుణ్‌కుమార్ దీనిని విడుదల చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, న్యాయవాదులు వి చిన్నారావు, తిరుగువల్లి బోసుబాబు, కదిరి రాము, ఎంఎస్ మాధవ్, నాగకుమారి, డి.రీనాకుమారి, జి నిర్మల, మధు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో సంస్కృతి సదన్


మహిళలకు కుట్టు మిషన్లు అందిస్తున్న విదేశీ బృంద సభ్యులు, సంస్థ డైరెక్టర్ సత్యదేవ్

తాటిచెట్లపాలెం: సామాన్య ప్రజలకు సేవలందించడమే లక్ష్యంగా జగద్గురు పీఠం ఆధ్వర్యంలో మాస్టర్ ఇ.కె. సంస్కృతి సదన్‌ను స్థాపించినట్లు సంస్థ డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ తెలిపారు. తాటిచెట్లపాలెంలోని సంస్కృతి సదన్‌లో టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు సోమవారం సంస్థను సందర్శించిన విదేశీ బృంద సభ్యులు క్రిస్టినా, మార్కర్స్, డాక్టర్ సెబీనాల చేతుల మీదుగా ఉచితంగా కుట్టుమిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి సదన్ ద్వారా ఇప్పటి వరకు సుమారు 69 బ్యాచ్‌ల్లో 1,600 మంది మహిళలకు వివిధ వృత్తి విద్యల్లో శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. విదేశీ బృంద సభ్యులు మాట్లాడుతూ మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య(ఇ.కె.), మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్‌ల బోధనలు, రచనలు తమనెంతో ప్రభావితం చేశాయని, మార్గదర్శకంగా ఉన్నాయని తెలిపారు. సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నమన్నారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహక సభ్యులు పి.రవిశంకర్, పసుమర్తి కృష్ణమోహన్, మహాత్మా గాంధీ మహిళా కేంద్ర నిర్వాహకురాలు దాట్ల రాధ తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ ఎమ్మెల్యేకు ఫిర్యాదుల వెల్లువ


ఫోన్ ద్వారా వచ్చే ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

డాబాగార్డెన్స్: డయల్ యువర్ ఎమ్మెల్యేకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఆశీల్‌మెట్ట అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తన కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు 99519 92777, 99519 93777 నంబర్ల ద్వారా ఫిర్యాదులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో పలు వార్డుల కార్పొరేటర్లు, అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్రాంతి సెలవుల్లో ప్రత్యేక తరగతులను నిరోధించండి


గొండు సీతారామ్‌కు వినతిపత్రం అందిస్తున్న టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ నాయకులు

సీతమ్మధార: ప్రభుత్వం ప్రకటించిన సంక్రాంతి పండగ సెలవుల్లో ప్రత్యేక తరగతులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్వహించకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్, ఎయిడెడ్ స్కూళ్లు, కాలేజీల్లో చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలని రాష్ట్ర ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళ్ల లోకనాథం, జిల్లా కన్వీనర్ కోట్ల గణేష్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆశీలమెట్టలోని కార్యాలయంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్‌కు వారు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీతారామ్ మాట్లాడుతూ సెలవుల్లో నూటికి నూరు శాతం అమలు జరిగేలా తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలని కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో అన్ని జిల్లాల ఆర్‌ఐవోలు, డీఈవోలకు స్పష్టంగా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘించి పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే వాటి గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు చట్టపరమైన చర్యలకు సిఫార్సులు చేయనున్నామని ఆయన చెప్పారు.

ఆసియన్ ఇండోర్ అథ్లెటిక్స్‌కు జ్యోతి



విశాఖ స్పోర్ట్స్: ఆసియన్ ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో నగర అథ్లెట్ వై.జ్యోతి పాల్గొనుంది. ఈ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు భారత్ తరపున 13 మంది చొప్పున వుమెన్, మెన్‌ను భారత అథ్లెటిక్స్ సమాఖ్య ఎంపిక చేసింది. వంద మీటర్ల పరుగులో జాతీయ రికార్డు నెలకొల్పిన విశాఖ అథ్లెట్ జ్యోతి జట్టుకు ఎంపికైంది. కజకిస్తాన్‌లో జరగనున్న ఈ పోటీల్లో 60 మీటర్ల స్ప్రింట్‌తో పాటు 60 మీటర్ల హార్డిల్స్‌లో జ్యోతి పాల్గొనుంది.

జీవో–1 చాలా ప్రమాదకరం

డాబాగార్డెన్స్: ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో–1 ప్రమాదకరమైందని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్ అన్నారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష నాయకులు, ప్రజలకు ఉన్న బంధాన్ని తొలగించడం కోసమే ఈ జీవోని తెచ్చారని విమర్శించారు. పరిపాలన గాలికొదిలేసి, పవన్‌కల్యాణ్‌పై మంత్రులు నోటికివచ్చినట్లు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. మంత్రులు లక్ష్మణరేఖ దాటారని ఇక నుంచి తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. రాష్ట్రానికి శని దాపురించిందని ఆరోపించారు. 12న యువశక్తిలో పవన్ కల్యాణ్ మాట్లాడనున్నారని చెప్పారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ కప్పు కాఫీ తాగితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వణుకు మొదలైందన్నారు. జగన్ సభలకు జనాలు రాకపోవడంతో డ్వాక్రా మహిళలు, సచివాలయ సిబ్బందిని తీసుకెళ్తున్నారని ఆరోపించారు.

బోటు యజమానికి నష్ట పరిహారం


బోటు యజమానికి నష్టపరిహారం అందిస్తున్న జానకీరామ్

మహారాణిపేట: గతేడాది అక్టోబర్‌లో సూపర్ సైక్లోన్ వల్ల కోణార్క్ తీరంలో కొట్టుకుపోయిన విశాఖపట్నం హార్బర్‌కు చెందిన అర్జిల్ల హరి కుటుంబాన్ని ఏపీ మరపడవల సంఘం ఆదుకుంది. ఈ సంఘటనలో హరి బోటుకు 50 లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లింది. దీంతో బోటు యజమాని కుటుంబానికి 3 లక్షల 50 వేల రూపాయలను రాష్ట్ర మరపడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ సోమవారం అందజేశారు. వచ్చే నెలలో మరో రెండు లక్షల రూపాయలను ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు, ఇతర నాయకులు మైలపల్లి నరసింహులు, జి.పోతయ్య, వాసుపల్లి దాను, మూగి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి


వెంకటేశ్వరమెట్ట–2 సచివాలయంలో వలంటీర్లు, కన్వీనర్లతో రంధి గోపీకృష్ణ తదితరులు

అల్లిపురం: వార్డు వలంటీర్లు, పార్టీ కన్వీనర్లు సమన్వయంతో పని చేయాలని 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ కోరారు. వెంకటేశ్వరమెట్ట–2 సచివాలయంలో వలంటీర్లు, కన్వీనర్లతో సోమవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఇంటికి వలంటీర్లతో కలసి కన్వీనర్లు వెళ్లి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులైన అందరికీ ప్రభుత్వ పథకాలు అందజేయాలని సూచించారు. సమావేశంలో సచివాలయం కన్వీనర్లు, నాయకులు నీలాపు అయ్యప్పరెడ్డి, కృష్ణారెడ్డి, మహిళా అధ్యక్షురాలు వై.చిన్నమ్ములు తదితరులు పాల్గొన్నారు.

- వుడ్‌యార్డు సచివాలయంలో అమ్మవారి వీధి సచివాలయం కన్వీనర్లు, వలంటీర్లతో గోపీకృష్ణ సమావేశమయ్యారు. కన్వీనర్లు, వలంటీర్ల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో సచివాలయం అడ్మిన్ కిరణ్, వలంటీర్లు పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్ కొత్త పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

జోన్–5 ఏసీపీ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపట్టిన రమణమూర్తి

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీపీ)గా ఐ.వి.రమణ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఉత్తర్వుల మేరకు ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు జోన్–5లో పనిచేసిన ఏసీపీ ఎం.అరుణవల్లి గాజువాక జోన్ ఏసీపీగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రమణమూర్తిని జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ అభినందించారు. కొత్త ఏసీపీ మాట్లాడుతూ జోన్ పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేసేలా కృషి చేస్తానని తెలిపారు. ఆయా సచివాలయాల పరిధిలో జరుగుతున్న నిర్మాణాలపై దృష్టి సారించాలని టౌన్ ప్లానింగ్ కార్యదర్శులకు సూచించారు. జీవీఎంసీ 40వ వార్డు నుంచి 63 వార్డులకు సంబంధించి అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఇంటి నిర్మాణాలు చేపట్టే వారు జీవీఎంసీ ప్లాన్‌కు దరఖాస్తు చేసుకుంటే ఎటువంటి ఇబ్బందులు ఉండవని జోన్ ప్రజలకు ఆయన సూచించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

అల్లిపురం : వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. సీఐ తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం.. పిల్లి వరలక్ష్మి తన రెండో భర్త కనకరాజు, పిల్లలతో కలసి చలువ తోటలో నివసిస్తుంది. ఆమెకు పిల్లి అప్పారావు అనే వ్యక్తితో తొలుత పెళ్లయింది. వారికి ఇద్దరు పిల్లలు. ప్రస్తుతం ఆమె కనకరాజు, పిల్లి అప్పారావులతో కలసి ఉంటుంది. ఆదివారం రాత్రి కనకరాజు మద్యం మత్తులో వచ్చి వరలక్ష్మితో గొడవపడ్డాడు. తిరిగి రాత్రి 2.30 గంటల ప్రాంతంలో మద్యం తాగి వచ్చి వేరే గదిలో పడుకున్నాడు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో కనకరాజు పడుకున్న గది నుంచి అరుపులు వినిపించడంతో వరలక్ష్మి అక్కడికి వెళ్లి చూడగా మంటల్లో కనకరాజు పడి ఉన్నాడు. వరలక్ష్మి మంటలను అదుపు చేసి టూటౌన్ పోలీసులకు సమాచారం అందజేసింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే కనకరాజు మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన సింగర్ కిషోర్‌కుమార్ గీతాలు


సంగీత విభావరిలో పాల్గొన్న గాయనీ గాయకులు

సీతంపేట: ప్రముఖ గాయకుడు కిషోర్‌కుమార్ గీతాలు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయంగా నిలిచి ఉంటాయని ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ ఆపరేషన్స్ బి.రమేష్‌ప్రసాద్ అన్నారు. హిందీ సినీ నేపథ్య గాయకుడు కిషోర్‌కుమార్ జ్ఞాపకార్థం మెలోడీ క్రియేటర్స్, శృతిలయ, రసరాగ మాధురి సంగీత సంస్థల ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సంగీత విభావరి నిర్వహించారు. ఎమ్మెస్ మాధవ్, నిహారిక పాడిన జానెజా దూండ్‌తా, హేమంత్‌కుమార్, శైలజ పాడిన భీగి భీగి రాతోన్‌మే, ప్రభాకర్, ఎస్.రాజేశ్వరి పాడిన కోరా కాగజ్ థా, అమ్మాజీరావు, సీవీ రాజేశ్వరి పాడిన కాంచిరే కాంచిరే, ప్రభాకర్, లక్ష్మీసాత్విక పాడిన గాత రహే మేరా దిల్, ఎస్ఎస్ఎన్ రాజు పాడిన రోటే హహ ఆటే హైసాద్ వంటి పలు హిట్ సాంగ్స్ ఆలపించి ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమంలో న్యాయవాది బైపా అరుణ్‌కుమార్, కొణతాల రాజు, ఫణిస్వామి, చెన్నా తిరుమలరావు, ఎం.వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఐవీఎఫ్ సెంటర్ తనిఖీ


ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డాక్టర్ అనిల్ కుమార్

మహారాణిపేట: జిల్లా పరిషత్ ప్రాంతంలో కృష్ణ ఐవీఎఫ్ సెంటర్, విజయ మెడికల్ సెంటర్‌ను వైద్య ఆరోగ్యశాఖ అదనపు సంచాలకుడు డాక్టర్ అనిల్ కుమార్ సోమవారం తనిఖీ చేశారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. ఐవీఎఫ్ కేంద్రంలో పరికరాలతో పాటు వైద్యులు, సిబ్బంది అర్హతలను పరిశీలించారు. విజయ మెడికల్ సెంటర్‌లో కలర్ డాప్లర్, ఎంఆర్ఐ స్కాన్‌లను పరిశీలించి రేడియాలజిస్టులతో సంభాషించారు. స్కాన్ చేసే గదుల్లో లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరం అని తెలిపే బోర్డులు పెద్దవిగా పెట్టాలని సూచించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ పి.జగదీశ్వరరావు, పాడేరు డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ పాషా, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'కు 10 అర్జీలు

సీతమ్మధార: స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 10 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పేర్లి శ్యామ్‌ప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చేతన్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.